LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
Visit Internet Edition @ www.nellore.com

# జమీన్ రైతు

**మామిడితోట అమ్మబడును**

గూడూరు - అరిమేనిపాడుకు సమీపం, చిల్లమానుచేను వద్ద 30 యకరముల మామిడితోట కాపుకు వచ్చినది. మంచినీటి వసతి కలిగినది. అమ్మబడును. వివరములకు సంప్రదించండి.

**ఫోన్: 0861 - 324481 (నెల్లూరు)**

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు   సంపుటి: 71   సంచిక: 2   14.1.2000 శుక్రవారం   12 పేజీలు   విడిప్రతి: రూ.2.00లు   జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

# మున్సిపల్ రిజర్వేషన్లపై సర్కార్ ఊగిసలాట!

## ముసాయిదా సిద్ధమైనా ముఖ్యమంత్రిదే తుది నిర్ణయం!

మునిసిపల్ ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్ల జాబితా సిద్ధం చేశారు అధికారులు. చట్ట ప్రకారం గతంలో నిర్దేశించిన నియమాల ప్రకారం మొత్తం మునిసి పాలిటీలకు రిజర్వేషన్ల లిస్ట్ రెడీ చేసిపెట్టారు. అయితే ఇదే ఫైనల్ జాబితా అని చెప్పడానికి లేదు. రిజర్వేషన్లకు సంబంధించి చట్టం చాలా అస్పష్టంగా వుంది. మునిసిపాలిటీలకు రొటేషన్ పద్ధతుల్లో రిజర్వు చేయాలని నిర్దేశిస్తూనే రిజర్వేషన్లకు జనాభా లెక్కలు పరిగణనకు తీసుకొనేటప్పుడు గత ఎన్నికల్లో చేసిన రిజర్వేషన్లను పట్టించుకోనవసరం లేదని సూచించింది చట్టం. అంటే ఏ మునిసిపాలిటీలోని ఏ వార్డు ఎవరికి కేటాయించాలి అనే విషయంలో ప్రభుత్వంలో వుండేవారి మాట చెలామణి కావడానికి అవకాశం కల్పించారన్నమాట.

రిజర్వేషన్ల నిర్ణయంలో ముందు ఎస్టీ, తర్వాత ఎస్సీ, తర్వాత బీసీ, చివరన స్త్రీలకు సీట్లు కేటాయించాలి. అంటే మునిసిపాలిటీలలో గిరిజనుల జనాభా అత్యధికంగా వుండేవాటిని ముందు విడిగా తీయాలి. వాటిలో హరిజనులు, బీసీల సంఖ్య ఎక్కువగా వున్నా పట్టించుకోకూడదు. తర్వాత ఇదే పద్ధతిలో తతిమా రిజర్వేషన్లు చేయాలి. మొత్తం మునిసిపాలిటీ పరిధిలోని జనాభాలో ఏ వర్గం శాతం ఎక్కువగా వుంటే దాన్ని పరిగణించాలి. సంఖ్య ఆధారంగా కాదు. చిన్న మునిసిపాలిటీలో హరిజనుల సంఖ్య 10వేలు మాత్రమే వుండినా - మొత్తం జనాభాలో అది 20 శాతం వుండి; పెద్ద మునిసిపాలిటీలో లక్ష మంది హరిజనులున్నా వారి శాతం 20 కంటే తక్కువగా వుంటే - చిన్న మునిసిపాలిటీయే రిజర్వు అవుతుంది. 1991 జనాభా లెక్కలు ఈ కేటాయింపుకు ప్రాతిపదిక. ఈ పదేళ్లలో కొన్ని మునిసిపాలిటీలలో ఆనాటి జనాభా కంటే నేటి ఓటర్ల సంఖ్య ఎక్కువ. బీసీలకు సంబంధించి 1991లో రాష్ట్ర బీసీ సహకార ఆర్థిక సంఘం జరిపిన సోషియో ఎకనామిక్ సర్వే లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలి. అయితే ఇవి కాకి లెక్కలు. అందువల్లనే ఎస్టీ, ఎస్సీ సీట్ల నిర్ణయం తర్వాత తతిమా అన్ని మునిసిపాలిటీల నుంచి లాటరీ ద్వారా బీసి రిజర్వేషన్ జరిపే పద్ధతి గతంలో పాటించారు బహుశా ఇప్పుడూ అదే జరగవచ్చు.

అధికారులు తయారు చేసిన జాబితా ప్రకారం నెల్లూరు, గూడూరు మునిసిపాలిటీలు జనరల్ మహిళల రిజర్వేషన్ కేటగిరీ క్రిందకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే బీసీల లాటరీ వేయకుండా మహిళలకు రిజర్వు చేయడం ఎట్లా సాధ్యమన్నది ప్రశ్న. నిజానికి అధికారులు చేసిన జాబితా తుది రూపం సంతరించుకోవడం అసంభవం. దీనికి ముఖ్యమంత్రి ఆమోద ముద్ర కావాలి. చట్టంలో వున్న లొసుగుల వల్ల ముఖ్యమంత్రి ఈ జాబితాను ఎట్లా కావాలంటే అట్లా మల్చుకునే వీలు వుంది. ఎస్సి, ఎస్టీలను మాత్రం చట్టం ప్రకారం జరిపించి, బీసి లెక్కలలో తమ ఇష్టం వచ్చిన మతలబు చేయవచ్చు.

ముఖ్యమంత్రి ఇంకా ఈ జాబితాను పరిశీలించలేదు. అందువల్ల జనరల్ మహిళలకు నెల్లూరు, గూడూరు రిజర్వు అయ్యాయన్న వార్తను తుది నిర్ణయంగా పరిగణించడానికి లేదు. కావలి ఏమైందన్న సమాచారం ఈ విలేఖరికి అందుబాటు కాలేదు.

* * *

# జన్మభూమి కర్మపై బాబు విచారణ


తాజా జన్మభూమి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వివాదాస్పదం కావడం ముఖ్యమంత్రిని ఆందోళనకు గురి చేస్తున్నది. మీడియాపైన తనకున్న పలుకుబడి వల్ల జన్మభూమి వైఫల్యం వార్తలకు పెద్దగా ప్రచారం రాకుండా జాగ్రత్తపడినప్పటికీ ప్రజలలో ఇంత వ్యతిరేకత ఎందుకు వచ్చింది అన్న విషయమై విచారణ జరిపిస్తున్నాడు చంద్రబాబు. తన పరిపాలనా సమర్థతకు ఈ కార్యక్రమాన్ని ఒక ప్రతీకగా వాడుతుంటాడాయన. దాని వల్లనే తాను, తన ప్రభుత్వం ప్రజలకు చేరువ కాగలిగామని, గత ఎన్నికలలో తన గెలుపుకు అది ప్రధాన కారణమని చంద్రబాబు నమ్మకం. ఎన్నికలు కాగానే ఇంత మార్పు ఆయన నమ్మలేకపోతున్నాడు. రాష్ట్ర మంతటా మంత్రులు, అధికారులు జన్మభూమి కార్యక్రమంలో ప్రజల నిరసన ఎదుర్కొన్నారు. గ్రామాలలో బహిష్కారానికి గురైనారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపంలో వున్నప్పుడు తెలుగుదేశం పార్టీకి ఇది ఆందోళన పరిణామం.

దీనికి తోడు విద్యార్థుల ఉద్యమం ప్రారంభమైంది. గత పది, పదిహేనేళ్లుగా విద్యార్థి సంఘాలు రాష్ట్రంలో ఎటువంటి ఆందోళనా కార్యక్రమం చేపట్టలేదు. కళాశాలలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరుగక పోవడం; ఎమ్‌సెట్ వంటి కాంపిటేటివ్ పరీక్షలలో పాసైతే తప్ప భవిష్యత్తులేని పరిస్థితి నెలకొనడంతో అధిక శాతం విద్యార్థులు ప్రైవేటు కాలేజీలు, ట్యూషన్లలో క్షణం తీరికలేని వారిగా తయారు కావడం వంటి కారణాల వల్ల విద్యార్థుల ఉద్యమాలు అంతరించి పోయాయి. దాదాపు ఒకటిన్నర, రెండు దశాబ్దాల తర్వాత విద్యార్థుల వీధుల్లోకి వస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల నియామకం నిలిపి వేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించడంతో విద్యార్థులలో అలజడి మొదలైంది. పారిశ్రామిక ప్రగతి లేక ప్రైవేటు రంగంలో ఉపాధి దొరకక, ప్రభుత్వ ఉద్యోగాలు లేక తమ భవిష్యత్తు ఏమి కావాలన్న భయాందోళనలు నెలకొనడంతో వారు ఉద్యమం ప్రారంభించారు. సిపిఐ, సిపిఎం పార్టీలు వీరికి ప్రత్యక్ష మద్దతు ఇస్తున్నాయి. ఈ పార్టీలలో ఉద్యమాల అలవాటు పోయి చాలా కాలమైంది. తెలుగుదేశంతో మిత్ర పక్షంగా వారు పాలక వర్గం కొమ్ము కాస్తుండినారింతకాలం. క్షీణించిపోయిన తమ రాజకీయ ప్రాభవం పునరుద్ధరించు కోవడానికి విద్యార్థులు వారికి పెద్ద ఉపకరణం వలె పనికి వస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఇంకా ఈ ఉద్యమంలో పాలు పంచుకోవడం లేదు. వారు కూడా తెరమీదకు వస్తే ఇది ఉధృత రూపం దాల్చడం ఖాయం.

ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితి చంద్రబాబుది! ఉద్యోగాల సంఖ్య పాలనా వ్యయం తగ్గిస్తానని ప్రపంచ బ్యాంకుకు అగ్రిమెంట్ వ్రాసి ఇచ్చారాయన. దాన్ని ఉల్లంఘిస్తే వారు సమ్మతించరు. అసలే ఆర్థిక సంక్షోభంలో వున్న ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు అప్పు లేకుండా బ్రతకలేదు. తన ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెంది - ప్రతి ఒక్కరికీ ఉపాధి లభిస్తున్నది చంద్రబాబు వాదన. కాని గత ఐదేళ్లలో అటువంటి విచిత్రం ఏదీ జరగలేదు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ ఏర్పడలేదు. దానితో ఆ వాదనను నమ్మే పరిస్థితి లేదు విద్యార్థులకు. రానున్న రోజులలో చంద్రబాబు ఎదుర్కోనున్న పెను సవాల్ ఈ విద్యార్థుల ఉద్యమం.

* * *

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు



KJ KRISHNA JEWELLERY
CENTRALLY AIR CONDITIONED
CHINNA BAZAAR, NELLORE - 1, Ph: 327531, 324680

గత నలభై సంవత్సరాలుగా
మీ ఆదరాభిమానాలు
పొందుచున్న సంస్థ.
సరికొత్త డిజైన్లకు,
అందమైన ఆభరణాలకు
మా షోరూంకు విచ్చేయండి.

... యం. రఘురాం

# ఉదయగిరి ఎక్సైజ్‌కు అవినీతి కిక్కు

ఉదయగిరి ఎక్సైజ్ కార్యాలయం అవినీతి మామూళ్ల మత్తులో తుళ్లి తూగుతుండడంతో బ్రాందీ షాపులు బార్లుగా మారిపోయాయి. సర్కిల్ పరిధిలో ఏ షాపును పరిశీలించినా వెనుక ముందు మందు ప్రియులకు అవసరమైన ఏర్పాట్లు చేసిపెడుతున్నారు.

## వర్థించుకొనే వారేరి?

ఎక్సైజ్ నియమ నిబంధనల ప్రకారం షాపుల్లో బాహా విక్రయాలు చేయడంగాని షాపులకు పరిసరాల్లో సేవించడం గాని విరుద్ధమైనప్పటికీ ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. ప్రకాశం, కడప జిల్లాలకు ఉదయగిరి మండలం సరిహద్దుగా ఉండడంతో దొంగ, కాపు సారాలతోపాటు నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం ఇక్కడ ఏరులై పారుతుంది. ముఖ్యంగా సీతారామపురం, వరికుంటపాడు మండలాల పరిధిలోని మద్యం షాపులవాళ్లు కడప జిల్లా నుండి ప్రముఖ కంపెనీల లేబిళ్లున్న దొంగ మద్యం తెచ్చి జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రొద్దుటూరు, అంతపురం ప్రాంతాల్లోని ఒక ముఠా ఇక్కడి షాపుల వారితో ఒప్పందం కుదుర్చుకొని ఈ అక్రమ మద్యాన్ని సరఫరా

తొరవ 8వ పేజీలో



నెల్లూరు, బాలాజీనగర్ 11వ అడ్డరోడ్డు నుండి పువ్వుపు దొరువు వరకు వున్న జిమ్మివాగు పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఇళ్ల మంత్రి ఆదాల ప్రభాకర రెడ్డి. ప్రక్కన మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి.

# కావలిచెరువుకు కలెక్టర్‌నీళ్లు

కావలి చెరువు క్రింద 3వేల ఎకరాల్లో పంట ఎండి పోకుండా వుండేందుకు ఒక తడిపాగు నీటిని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీలక్ష్మీ నిర్ణయం తీసుకొన్నారు. 9తేది

## జిల్లావార్తలు

జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనను కావలి వచ్చిన కలెక్టర్ దృష్టికి ఈ ప్రాంతరైతులు నీరు లేక తమ పంటలు ఎండిపోతున్న విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై వెనువెంటనే స్పందించిన కలెక్టర్ కావలి కాలువ, జలదంకి చెరువులను పరిశీలించి, గొరవరం మేజర్ తూమును నాలుగు రోజులపాటు మూసి వుంచాలని నీటిపారుదల శాఖాధికార్లను ఆదేశించి, దగ్గరుండి తానే తూమును మూయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేఖరులతో మాట్లాడుతూ కావలి కాలువ క్రింద 3వేల ఎకరాలు ఎండి పోకుండా ఒక తడి నీరు ఇవ్వడానికి నిర్ణయం తీసుకొన్నట్లు చెప్పారు. జిల్లాలో తీవ్ర కరవు పరిస్థితులున్నాయని సాధ్యమైనంత వరకు కరవును ఎదుర్కొవడానికి సిఎండి క్రాప్ కార్యక్రమం క్రింద చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. కావలి కాలువకు నీరందించడానికి 4లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కావలి ఎమ్మెల్యే వేణు

తొరవ 7వ పేజీలో

# ఫ్యామిలీ ప్లానింగ్‌కు ఎమ్మెల్యే బంపర్ స్కీమ్!

ఆత్మకూరు నియోజక వర్గంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొన్న వారికి ప్రోత్సాహక బహుమతిగా ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య వెయ్యేసి రూపాయల వంతున అందజేయనున్నారు. నియోజక వర్గంలో కుటుంబ నియంత్రణకు అర్హులైన వెయ్యి కుటుంబాల వారికి ఈ బహుమతి అందించను ఎమ్మెల్యే ముందుకు వచ్చారు. ఈ నెల 17తేది నుంచి మార్చి 31తేది వరకు నియోజక వర్గ పరిధిలోని ఆత్మకూరు, పొదలకూరు, కలువాయిల్లో వైద్య ఆరోగ్యశాఖ జరిపే ప్రత్యేక శిబిరాల్లో ఆపరేషన్లు చేయించుకొన్న వారికి ఈ ప్రోత్సాహం లభిస్తుంది. ఇదిగాక ఆపరేషన్ చేయించుకొన్న ప్రతి 50 మందిలో ఒకరిని ప్రత్యేక డిప్ ద్వారా ఎంపిక చేసి 5వేల రూపాయలు, పథకం ముగిశాక నిర్వహించే బంపర్ డిప్ ద్వారా మొదటి బహుమతిగా యాభైవేల రూపాయలు, రెండవ బహుమతిగా పదివేల రూపాయలను ఐదు

## ఇది బొల్లినేని స్టయిల్

మందికి అందించనున్నట్లు బొల్లినేని కృష్ణయ్య 12తేది నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి ప్రభుత్వం కూడా వెయ్యి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుంది. ఒక మంచి పథకానికి చేయూతనిస్తున్న కృష్ణయ్య అభినందనీయుడు.

## కల్తీలకు నిలయం కావలి

కావలి మార్కెట్‌లో ప్రతి వస్తువును కల్తీ చేసి అమ్ముతున్నారు. పండుగ నెల కావడంతో కల్తీలకు అడ్డు అపుచేకుండా పోయింది. నిత్యావసరాలైన పప్పులు, వంటనూనెల్లో ఈ కల్తీ ఎక్కువగా ఉంది. వేరుశనగనూనె హోల్‌సేల్ ధరకంటె, రిటైల్ ధర తక్కువగా వుంది. వేరుశనగ నూనె మిల్లుల వద్ద కేజీ 48 రూపాయలు అమ్ముతుండగా, ఆశ్చర్యం గొల్పేలా రిటైల్ వ్యాపారస్తులు కేజీ 30 రూపాయలకే

తొరవ 8వ పేజీలో


# శ్రద్ధాంజలి



అనురాగం మూర్తీభవించిన

మా మేనత్త

## పులకం సరోజనమ్మ గారు

(స్వర్గీయ లక్ష్మీనారాయణరెడ్డి గారి భార్య)

6.1.2000 తేది మద్రాసులో పరమపదించారు.

## పెద్దకర్మ

20.1.2000 తేది గురువారం చీరాలలో, లక్ష్మీ థియేటర్ ఎదురుగా, మా స్వగృహమున జరుగును. బంధుమిత్రులు తెలియగోరుతాము.

సోదరుడు - మరదలు

ఓబిలి అబ్బాయిరెడ్డి
అడ్వొకేట్, నెల్లూరు
- మంజులమ్మ

మేనల్లుడు

డాక్టర్ ఓ. విజయనాథ్

మేనకోడలు

ఓ. వైదేహి

